క్లుప్తంగా

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం

కడియం: మురమండలో కొలువైన ముత్యాలమ్మ తీర్థం గురువారం వైభవంగా జరిగింది. ఏటా ముక్కనుమ రోజు అమ్మవారి తీర్థం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ముసలమ్మ అమ్మవారికి రథం సమర్పణ



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

కడియం: కడియపులంక గ్రామదేవత ముసలమ్మ అమ్మవారికి విశ్వేశ్వర హైటెక్ నర్సరీ అధినేతలు నక్కా కాశీ విశ్వేశ్వరరావు, నక్కా అమ్మిరాజు సుమారు రూ.20 లక్షల విలువైన రథాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తొలిసారిగా అమ్మవారిని రథంలో ఊరేగించారు. మహిళలు 108 కలశాలతో అమ్మవారికి స్వాగతం పలికారు. కోలాట భజన బృందాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వైభవంగా రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, నర్సరీ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధవళేశ్వరం: గ్రామంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా గురువారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై పడిపోయిన వీరిద్దరినీ 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో ధవళేశ్వరానికి చెందిన పోసయ్య ఒకరు కాగా, మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆలయాల్లో భక్తుల సందడి

రాజానగరం: నియోజకవర్గంలోని సాయిబాబా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన వారితో పాటు స్థానికులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం హారతి సమయం వరకూ, తిరిగి సాయంత్రం వేళలలో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. స్థానిక సాయిబాబా ఆలయంలో కొందరు తమ చిన్నారులకు పటిక బెల్లంతో తులాభారం వేసి, మొక్కులు తీర్చుకున్నారు. అన్నసమారాధనకు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

వాహన చోదకా.. లైసెన్సు ఉందిగా..

- డ్రైవింగ్ చేయడానికి లైసెన్సు తప్పనిసరి
- తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

కంబాలచెరువు: జనాభాకు అవసరాలకు తగ్గట్టుగా ద్విచక్ర వాహనాలు, కార్లు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహనా రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. సంబంధిత శాఖలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఫలితం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు.

నిబంధనలు బేఖాతరు

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహన చోదకుడూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్న నిబంధన ఉంది. కానీ ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. లైసెన్స్ అనేది రవాణా, పోలీసు శాఖల కోసమే అని చాలా మంది భావన. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్డుపైకి వచ్చే వారే సగం ప్రమాదాలకు కారణం అవుతున్నారని జరిగిన ప్రమాదాల లెక్కలు చెపుతున్నాయి. దీనికి తోడు కొందరు తమ పిల్లలకు మైనారిటీ తీరకుండానే వాహనాలు ఇస్తున్నారు. వారు అతివేగం, నిర్లక్ష్యంతో రోడ్లపై వాహనాలు నడిపి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.



తనిఖీలో పట్టుబడిన లైసెన్సు లేని వాహన చోదకులు

లైసెన్సు పొందే విధానం

వాహనం నడపటానికి డ్రైవింగ్ లైసెన్సు చాలా అవసరం. దీన్ని మంజూరు చేయడానికి రవాణాశాఖ పరీక్షలు నిర్వహిస్తుంది. దానిలో మొదటిది లెర్నర్ లైసెన్స్. మైనారిటీ తీరిన తర్వాత లైసెన్స్ పొందేందుకు నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రహదారి నిబంధనలు, వివిధ సింబల్స్, హెచ్చరికల బోర్డులు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం రవాణా శాఖ కార్యాలయంలో కంప్యూటర్‌లో పరీక్ష రాయాలి. ఈ పరీక్ష ఉత్తీర్ణులైన 40 రోజుల లోపు పర్మినెంట్ లైసెన్స్ పొందాలి. ఈ దశలో రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణలో స్వయంగా మన వాహనంపై డ్రైవింగ్ చేయాలి. అనంతరం లైసెన్స్ మంజూరు చేస్తారు.

10,303 కేసులు

రోడ్డ ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. లైసెన్సు లేని వాహన చోదకులను గుర్తించి జరిమానా విధిస్తున్నారు. ఇలా 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకూ 10,303 కేసులు నమోదు చేశారు. వారి నుంచి జరిమానాగా రూ.51.53 లక్షలు వసూలు చేశారు.

ప్రయోజనాలు ఇవే..

వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి కండీషన్ ఎంత ముఖ్యమో, ఇన్సూరెన్స్ కూడా అంతే అవసరం. ప్రమాదాల సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహనం ఇచ్చిన సంబంధిత వాహన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనం నడపడం పెద్ద తప్పిదం. దీని వల్ల జైలుశిక్ష, జరిమానా కూడా విధిస్తారు. వాహనానికి పూర్తిస్థాయిలో ప్రమాద బీమా ఉన్నా, లైసెన్స్ లేని వాహన చోదకుడికి అది వర్తించదు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు మైనారిటీ తీరకుండానే వాహనాలు ఇస్తున్నారు. వారు నడపడం చూసి ఆనందం వ్యక్తం చేస్తుంటారు. కానీ దానివల్ల జరిగే నష్టాన్ని ఊహించరు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వాహనం ఇవ్వడం నేరం. ఈ విషయాన్ని పెద్దలు గమనించాలి. తప్పనిసరిగా తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకూ పిల్లలకు వాహనం ఇవ్వకూడదు.

– సీహెచ్ సూరిబాబు, ట్రాఫిక్ సీఐ, రాజమహేంద్రవరం

హెడ్ కానిస్టేబుల్‌ను గాయపరిచిన వ్యక్తికి జైలు

కడియం: హెడ్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించి, అతడిని తీవ్రంగా గాయపర్చిన కేసులో పొట్టిలంక గ్రామానికి చెందిన డేగల వరప్రసాద్‌కు ఏడాది జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి భాషా తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలులో ఉండాలన్నారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కడియం పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరవరం గ్రామంలో 2022లో కనకదుర్గమ్మతల్లి జాతర జరిగింది. అక్కడ బందోబస్తు డ్యూటీలో ఉన్న టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ పి.బుజ్జిబాబును పొట్టిలంకకు చెందిన డేగల వరప్రసాద్ తీవ్రంగా గాయపరిచాడు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ పీవీవీఎస్‌టీ రాజు వాదనలు వినిపించగా, కడియం సీఐ ఏ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో అప్పటి కోర్టు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, ప్రస్తుత కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో అత్యుత్తమ ర్యాంకులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

కంబాలచెరువు: డాక్టర్ ఏఎస్ రావు అవార్డు కౌన్సిల్ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షలో రాజమహేంద్రవరం షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఈ విషయాన్ని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య గురువారం ప్రకటనలో తెలిపారు. తమ లక్ష్య ప్రోగ్రాంలో 10వ తరగతి చదువుతున్న ఐ.కశ్యప్ వంశీ ప్రథమ, వి.పూజేంద్ర ద్వితీయ స్థానాల్లో నిలిచారని, మొత్తం 8 మంది విద్యార్థులు 20 లోపు ర్యాంకులు సాధించారన్నారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 9వ తేదీన జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు ప్రథమ విజేతకు రూ.25 వేలు, ద్వితీయ విజేతకు రూ.15 వేలు బహుమతిగా అందజేస్తారన్నారు. తమ విద్యార్థులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడంపై విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. వారిని చైర్మన్‌తో పాటు డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య డీన్ కె.శ్రీనివాస్ అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని మన్యం సూరయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1985 –1990 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా జరిగింది. సుమారు 35 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. స్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమ ప్రారంభమైంది. తమతో చదువుకుని మరణించిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం డ్యాన్సులు, విందుతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, శేషుబాబు, సుబ్రహ్మణ్యం, పాపారావు, బ్రహ్మాజీరావు, లక్ష్మణుడు, కోటేశ్వరరావు, అమ్మిరాజు అయ్యన్న పాల్గొన్నారు.

సాయినగర్ పార్కును శుభ్రం చేశారు





పార్కును శుభ్రం చేస్తున్న జయశ్రీ తదితరులు

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పదో డివిజన్ సాయినగర్ మెయిన్ రోడ్డులో లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్‌కు పార్కుకు మోక్షం లభించింది. దీన్ని శుభ్రపరిచేందుకు లయన్స్ క్లబ్ తరఫున నిర్వాహకులు గురువారం సిద్ధమయ్యారు. ఈ పార్కులో చెత్త పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ సమస్యపై ఆహ్లాదానికి తాళం, మసి పూసి మాయ చేసి అనే శీర్షికలతో సాక్షి పత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వాటిపై లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి పూర్వపు అధ్యక్షురాలు, పార్కు నిర్వాహకురాలు నేరేళ్ల జయశ్రీ స్పందించారు. ప్రత్యేకంగా పనివాళ్లను ఏర్పాటు చేసి పార్కును శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. ప్రజలకు నిత్యం పార్కు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ పార్కును తాను క్లబ్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలోనే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. స్థానికులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు నగర పాలక సంస్థ అధికారులతో కలసి చర్యలు చేపడుతున్నట్లు జయశ్రీ తెలిపారు.



పార్కులో పేరుకుపోయిన చెత్త, ఆకులు (ఫైల్)

మధుర జ్ఞాపకాలతో తిరుగు ప్రయాణం



రాజమహేంద్రవరం బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు



పల్లె వెలుగు బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

- ముగిసిన సంక్రాంతి వేడుకలు
- సొంతూరి నుంచి బయలుదేరిన ప్రజలు
- కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగను సొంతూరులో ఘనంగా చేసుకునేందుకు పట్టణాల నుంచి వచ్చిన ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తిరుగు ప్రయాణ మయ్యారు. మూడు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సందడిగా గడిపిన వీరందరూ ఆ జ్ఞాపకాలను మదిలో నిలుపుకొన్నారు. కన్నవారికి, సొంతూరికి, స్నేహితులకు వీడ్కోలు చెప్పి తమ జర్నీ ప్రారంభించారు. పండగ సందర్భంగా హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి పలువురు తమ సొంతూళ్లకు వచ్చారు. నాలుగు రోజులుగా తమ గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో సరదాగా గడిపారు. ఆటలు, ముగ్గులు తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆ సన్నివేశాలను తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు.



రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో రద్దీ

ప్రయాణికుల రద్దీ

పండగకు వచ్చిన వారందరూ తిరిగి తమ ప్రాంతాలకు పయనమవ్వడంతో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారాయి. రిజర్వేషన్ బస్సులతో పాటు పల్లె వెలుగు బస్సులు కూడా కిటకిటలాడాయి. ఉదయం మామూలుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం నుంచి భారీ పెరిగింది. బస్సులు ప్లాట్‌ఫాంపైకి రాకుండానే ప్రయాణికులు ఎదురెళ్లి ఎక్కసాగారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు బస్సులను ఏర్పాటు చేశారు.

19 వరకూ ప్రత్యేక సర్వీసులు

ప్రయాణికుల రద్దీగా అనుగుణంగా, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డీపీటీవో షర్మిలా అశోక్ తెలిపారు. నిడదవోలు, గోకవరం, కొవ్వూరు, రాజమహేంద్రవరం డిపోల నుంచి 75 ప్రత్యేక బస్సులు తిరుగుతున్నాయన్నారు. వీటిని ఈ నెల 19వ తేదీ వరకూ కొనసాగిస్తామన్నారు. ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

బీలాలమ్మకు ప్రత్యేక పూజలు



బీలాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: సింగంపల్లి గ్రామ శివారులో కొలువైన బీలాలమ్మకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామస్తులు అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బీలాలమ్మను మాజీ ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బన్న, సర్పంచ్ ఆనంద్, వైస్ సర్పంచ్ సోమిశెట్టి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకరపల్లి ప్రసాద్, వీరబాబు, మేనేడి వీరబాబు, ద్వారంపూడి వాసు ఉన్నారు.

పురుషుల కబడ్డీ విజేత జి.మామిడాడ



విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న కొవ్వూరి వేణుగోపాలరెడ్డి

బిక్కవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొంకుదురు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పురుషుల కబడ్డీ పోటీల్లో కాకినాడ జిల్లా పెదపూడి మండలం జి.మామిడాడ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సామర్లకోట జట్టుపై 23–18 తేడాతో జి.మామిడాడ విజయకేతనం ఎగుర వేసింది. అనంతరం విజేతలకు కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాస్ రెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీపీ, ఎస్వీ సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి వెంకట రామారెడ్డి, కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ శంకరుల రథోత్సవం



శ్రీరంగపట్నం రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గౌరీ శంకరుల రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా జరిగిన రథోత్సవంలో గౌరీ శంకరులు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించారు. వీరభద్రుల సంబరం, అమ్మవారికి సారె ఊరేగింపు జరిగాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించడం ఇక్కడి ఆచారం. రథోత్సవంలో యువకుల వేషధారణ, విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గంగాలమ్మ తీర్థం వైభవంగా నిర్వహించాలి

పెదపూడి: అనపర్తి మండలం కొత్తూరులోని గంగాలమ్మ తీర్థం ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాదీ అమ్మవారి తీర్థం వైభవంగా నిర్వహించడం అభినందనీయమని ఆలయ కమిటీ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సంతోష్ నగర్, భవానీపురం, అఫీషియల్ కాలనీ, క్రికెట్ గ్రౌండ్, బాచి నగర్, కాతేరు రావు బిల్డింగ్ ఏరియా, కోలమూరు, రాయుడుపాకలు, కేశవ హాస్పిటల్ ఏరియా, బొమ్మన కాలనీ, పాత కోలమూరు, పరిమినగర్, ఎయిర్‌పోర్ట్ రోడ్, ఆనంద్ రీజెన్సీ కాలనీ, హెచ్‌సీడీసీ కాలనీ, తొర్రేడు, వెంకటనగరంలో విద్యుత్ ఉండదన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

సీతానగరం: దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురం సెంటర్‌లో బుధవారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడుతున్నారు. అదే గ్రామానికి చెందిన గోవింద రాజులు వారిని వారించాడు. దీంతో ఘర్షణ పడుతున్న వారిలో ఒకడైన చల్లా సూరిబాబు ఆగ్రహం వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న బైక్ గేర్ కేస్‌తో గోవిందరాజులు తలపై కొట్టాడు. దీంతో గాయాలపాలైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

109 మంది అరెస్టు

రాజానగరం: మండలంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన కోడి పందేలపై దాడులు నిర్వహించి, 109 మందిని అరెస్టు చేశామని సీఐ ఎస్పీ వీరయ్య గౌడ్ తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 40 కేసులు నమోదు చేసి, రూ.50,520, 48 కోడి పుంజులు, 48 కోడి కత్తులను స్వాధీనపరుచుకున్నామన్నారు.

కోడిపందేలు ఆడుతున్న 29 మందిపై కేసు

బిక్కవోలు: పేకాట, కోడిపందేలు ఆడుతున్న 29 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెంలో కోడి పందేలు ఆడుతున్న 12 మందిపై ఆరు కేసులు నమోదు చేసి, వారి నుంచి 12 పుంజులు, 3,240 స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని పేకాట ఆడుతున్న 17 మందిపై ఆరు కేసులు నమోదు చేసి, రూ.23,670 స్వాధీనం చేసుకున్నామన్నారు.

హరిదాసుకు సత్కారం

రంగంపేట: మన సంస్కృతి, సంప్రదాయాలకు హరిదాసులు ప్రతీక అని రంగంపేట మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం హరిదాసును వీర సుందరరావు, దేవీ పార్వతి దంపతులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ధనుర్మాసంలో విష్ణుమూర్తి ప్రతినిధులుగా హరిదాసులు గ్రామాల్లో సంచరిస్తూ, హరినామ సంకీర్తనలు చేస్తారన్నారు. వీరి గురించి పిల్లలకు తెలియజేయడం మన బాధ్యత అన్నారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: గేమ్ ఛేంజర్
సూర్య ప్యాలెస్	: డాకు మహరాజ్
స్వామి	: గేమ్ ఛేంజర్
శివజ్యోతి	: సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	: గేమ్ ఛేంజర్
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: గేమ్ ఛేంజర్
మేనక	: సంక్రాంతికి వస్తున్నాం
రంభ	: డాకూ మహరాజ్
కుమారి	: డాకు మహరాజ్
అప్సర	: డాకు మహరాజ్
అశోక	: డాకు మహరాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్, డాకు మహరాజ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డాకు మహరాజ్, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్